

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

గురువారం | 15 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08




## అచ్చంపేటతో 46 ఏండ్ల బంధం

తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా సంక్షేమ పథకాలు

పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మన్ననూర్‌లో రూ.53.78 కోట్లతో 220/30 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో పుట్టడమే అదృష్టంగా భావించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి ..మిగతా 2లో

## 171 అన్యాక్రాంతం...!



కర్దనూర్‌లో ప్రభుత్వ భూమిలో బోరు.. ప్రీకాస్ట్ గోడలు

అధికారుల స్పందన ఏది?

కర్దనూర్‌లో ప్రభుత్వ భూమికి రక్షణ కరువైందా?

నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోనే ఆక్రమణలు

అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి?

**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం కళ్ల ముందే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయా? ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా ..మిగతా 2లో

## భూ రీసర్వేతో సమస్యలకు చెక్

రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

వెంకటాపూర్‌లో భూ రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణ పేట,అక్షిత బ్యూరో:** జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రత్యేక సర్వే బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన ..మిగతా 2లో

## జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు కృషి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే పాత్రికేయులు తమ ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.సన్‌రైజ్ ఆసుపత్రి, సహకారంతో, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ..మిగతా 2లో

## జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు కృషి



**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్‌రైజ్ ఆసుపత్రి లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడి, సమయాభావం కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చునితెలిపారు. జర్నలిస్టులు,తమతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు ఉచిత వైద్య సంప్రదింపులు అందించడంతోపాటు అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్లు, మధుమేహం, నాడీ సంబంధిత సమస్యలతోపాటు మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలటీయూడబ్ల్యూజే?ఐజేయూరాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ అలీ, జిల్లా అధ్యక్షుడు బనీడారి యాదగిరి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సన్‌రైజ్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ స్వామి గౌడ్, రథసారథి తెలుగు దినపత్రిక సంపాదకుడు సంతోష్ గౌడ్, జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేతో సమస్యలకు చెక్



**మొదటి పేజీ తరువాయి...**

సర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్‌లను ఆదేశించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, భూహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూ సరిహద్దుల నిర్ధారణతో పాటు రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా నివారించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామంలో 640 ఎకరాల భూమి ఉంది అని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఫౌండేషన్ ప్రకారం రీసర్వే నిర్వహించి, 108 మందికి ఫారం-11 జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్లాస్పూర్ గ్రామంలో 24 మందికి సంబంధించి రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. సర్వే బృందాల్లో పనిచేస్తున్న చైన్‌మెన్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకోగా, ప్రస్తుతం 24 మంది చైన్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిర్దేశించిన పనులన్నింటినీ రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రీసర్వే ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రామ్‌కోటి, రెవెన్యూ,సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 171 అన్యాక్రాంతం...!

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవహరిస్తోందా? అన్న ప్రశ్నలు కర్దనూర్ ప్రాంతంలో స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్దనూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 171లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ భూమిలో అక్రమంగా బోరు వేయడంతో పాటు, ప్రీకాస్ట్ గోడలు ఏర్పాటు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ భూమిలో బోరు.. ప్రహరీ గోడలు!**

ప్రభుత్వ భూమిలో బోరు వేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారు? ప్రహరీ గోడలు నిర్మించేందుకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? భూమి ప్రభుత్వానికి చెందినదైతే దానిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిలో రాళ్ల కుప్పలు, నేల చదును చేసిన ఆనవాళ్లు, ప్రీకాస్ట్ గోడలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ రికార్డులు, సర్వే నివేదికలు, అనుమతుల వివరాల ద్వారా వాస్తవాలను అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.



**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోనే పరిస్థితి!**

కర్దనూర్‌లో నూతనంగా నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోనే ఈ వ్యవహారం చోటుచేసుకుంటోందని స్థానికులు చెబుతున్నారు. భూముల రికార్డులు, సరిహద్దులు, రిజిస్ట్రేషన్ల వ్యవహారాలతో సంబంధం ఉన్న కార్యాలయం సమీపంలోనే ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ భూముల పరిరక్షణకు బాధ్యత వహించే రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు స్థలాన్ని పరిశీలించారా? భూమి హద్దులను గుర్తించారా? ఆక్రమణ ఆరోపణలపై విచారణ చేపట్టారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి**

ఈ వ్యవహారంపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, సర్వే నంబర్ 171లో సమగ్ర భూ సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలు లేదా బోరు ఏర్పాటు జరిగినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి. దాని పరిరక్షణ అధికారుల బాధ్యత. ఆక్రమణ ఆరోపణలపై మౌనం కాకుండా పారదర్శక విచారణ, స్పష్టమైన సమాధానం, చట్టబద్ధమైన చర్యలే ప్రజలకు భరోసా కల్పిస్తాయి.

సదరు భూమికి సంబంధించిన స్ట్రక్చర్ మ్యాప్‌ను అందించాలని మండల సర్వేయర్‌కు సూచించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే సహించేది లేదని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేసినట్లు డిప్యూటీ తహసిల్దార్ వివరణలో వెల్లడైంది.

# అచ్చంపేటతో 46 ఏండ్ల బంధం

**మొదటి పేజీ తరువాయి...**

మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో రూ.53.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 220/30 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ......, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, రైతుల సంక్షేమం, మహిళలకు కల్పిస్తున్న సౌకర్యాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు.

ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సంక్షేమం అనేది కేవలం కొన్ని వర్గాలకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు అందించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కూడా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు అందించడంతో పాటు విద్యుత్, వైద్యం, ఆహార భద్రత వంటి కీలక రంగాల్లో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ప్రజల జీవన ప్రయాణంలోని వివిధ దశల్లో ప్రభుత్వ సహకారం అందేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్ర ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడం, ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడంలో పేదలకు వెసులుబాటు కలగడం వంటి అంశాలకు సంక్షేమ కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన వివరించారు. ఆహార భద్రత నుంచి ఆరోగ్య సంరక్షణ వరకు, రైతుల సంక్షేమం నుంచి మహిళల ప్రయాణ సౌకర్యాల వరకు పలు రంగాల్లో ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

ప్రజలకు అందించే సంక్షేమ ప్రయోజనాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు సామాజిక భద్రతను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రంలో ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో సుమారు 1.10 కోట్ల కుటుంబాలు ఉండగా, వాటిలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కుటుంబాలపై రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన ఒక కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల పేద కుటుంబాలు నాణ్యమైన వైద్యసేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సహాయం అందిస్తున్నామని చెప్పారు.

సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు.

యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఉద్యోగాల ద్వారా యువత స్వయం సమృద్ధి సాధించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో రూ.53.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 220/30 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం తనకు ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా స్థానిక విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు లభించనుంది. ప్రాంతీయ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు అవసరమైన వ్యవస్థలను అభివృద్ధి చేయడం గ్రామీణ ప్రాంతాల పురోగతికి కీలకమని ఆయన పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గం ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉండేదని రానున్న రోజుల్లో అచ్చంపేట నియోజక వర్గంలో ఒక మంచి జంక్షన్ గా మారబోతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

# నేనెప్పుడూ పాలకుడిని కాదు..

# ప్రజా సేవకుడినే!

### ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

### రూ.20 లక్షలతో దీన్‌దయాళ్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన..

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు క్యాంపు కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ ,50 వ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పూర్తిస్థాయి గ్రామీణ వాతావరణం కలిగిన శాయంపేట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో శాయంపేట పరిధిలోని కొన్ని కాలనీలకు ఎమ్మెల్యేలు సైతం పర్యటించని పరిస్థితి ఉండేదని, తాను గెలిచిన నాటి నుంచి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు.

ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు స్థానిక సమస్యలను తీసుకువచ్చారు.వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే, మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్,మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు,నెక్కొండ కవిత కిషన్,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,మాజీ అధ్యక్షులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

# మల్లు భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం

### మన్ననూర్‌లో స్వాగతం పలికిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి





**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అచ్చంపేట శాసన సభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ రెవిన్యూ బి చెన్నయ్య, బుధవారం అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూర్ గ్రామంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి మన్ననూర్‌కు చేరుకున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపముఖ్యమంత్రి కి స్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మన్ననూర్‌కు చేరుకున్నారు.

# చిన్నకాపర్తిలో సుదర్శన క్రియ, యోగా కార్యక్రమాలు ప్రారంభం



**చిట్యాల, అక్షిత ప్రతినిధి :** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ కుమార్ రెడ్డి సహకారంతో వారం రోజులపాటు నిర్వహించనున్న సుదర్శన క్రియ, యోగా, ధ్యాన కార్యక్రమాలు సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్, నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు గ్రామస్థులు, యువకులు, భవాని మాలధారులకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గుత్తా అమిత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉంటూ యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పొందాలని, సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వలిగొండ సత్యనారాయణ, పల్లపు ప్రశాంత్, ఆవుల రమేష్ యాదవ్, పొలిమేర దశరథ, శిలివేరు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి దేవస్థానం నూతన ట్రస్టీ బోర్డు ఏర్పాటు..

### రెండేళ్ల కాలపరిమితితో

### 11 మంది సభ్యులతో ట్రస్టీ బోర్డు





**వరంగల్, అక్షిత బ్యూరో:** ఓరుగల్లు ఇలవేల్పు శ్రీ భద్రకాళి దేవస్థానం ట్రస్టీ బోర్డు ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లేఖ విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితితో 11 మంది సభ్యులతో ట్రస్టీ బోర్డు ఏర్పాటుకు సీఎం ఆమోదం.ఈ ట్రస్టీ బోర్డులో వరంగల్ సీనియర్ జర్నలిస్ట్ కమటం వేణుగోపాల్‌కు,కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, సురేష్ బాబు, శ్రవణ్ కుమార్ రెడ్డి, అంజనీ దేవి, సతీష్, పేరాల శ్రీనివాసరావు, రమేష్ చంద్ బాంగ్, చింతలపాని వాసవి రెడ్డి, మోతుకూరి మయూరి ట్రస్టీ బోర్డు సభ్యులుగా జాబితాలో ఉన్నారు. ట్రస్టీ బోర్డు ఏర్పాటుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఎండోమెంట్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లేక విడుదల చేసింది.

## దారి ఉంది.. దిశ చూపే బోర్డులేవీ!

### అమ్మనబోలు, నీర్నెముల,వేములకొండ వెళ్లే మార్గాల్లో ప్రయాణికుల ఇబ్బందులు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రం నుంచి అమ్మనబోలు , నీర్నెముల, వేములకొండ గ్రామాలకు వెళ్లేందుకు రహదారులు ఉన్నప్పటికీ, ఆయా మార్గాల్లో దారి సూచించే బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొత్తగా ఈ ప్రాంతాలకు వచ్చే ప్రయాణికులు ఏ దారిలో వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. రహదారుల కూడళ్ల వద్ద గ్రామాల పేర్లు, దూరాన్ని తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు స్థానికులను అడిగి దారి తెలుసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పనులపై వెళ్లేవారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రామన్నపేట నుంచి అమ్మనబోలు , నీర్నెముల, వేములకొండ వెళ్లే మార్గాల్లో గ్రామాల పేర్లు, దూరాన్ని సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుర చైర్పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ హాజరై ప్రారంభించారు. అనంతరం మహిళలకు చైర్ పర్సన్ మోగదాల రమేష్ పావని చేతుల మీదుగా బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంజేఫ్ లయన్ ఎండి అతహర్ పాషా, చార్టెడ్ ప్రెసిడెంట్ ఎంజేఫ్ లయన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా , సెక్రటరీ ఎంజేఫ్ లయన్ దాచేపల్లి రాజు, ట్రెజరర్ ఎంజేఫ్ లయన్ బత్తిని రఘు, ఫాస్ట్ ప్రెసిడెంట్ ఎంజేఫ్ లయన్ మోగదాల రమేష్ , పాస్ట్ ప్రెసిడెంట్ ఎంజేఫ్ లయన్ కొసనం రామ్ రెడ్డి , ఎంజేఫ్ లయన్ చింతల ప్రభాకర్ రెడ్డి, ఎంజేఫ్ లయన్ వనం రాజు, ఎంజేఫ్ లయన్ పోలోజు రాజు, పాల్గొన్నారు.

## హనుమండ్ల దశరథం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం,నాగిళ్ల గ్రామానికి చెందిన దివంగత హనుమండ్ల దశరథం కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు.మాజీ ఎంపీటీసీ సురమల్ల సత్తయ్య ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 5,000/-ఐదు వేల రూపాయలుఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ కంచనపల్లి సత్తయ్య,వార్డు సభ్యులు నాగిళ్ల పెద్దయ్య,తిరుమల్ల లక్ష్మయ్య, బండ శ్రీనివాస్,చాట్ల శ్రీశైలం,మాజీ వార్డు సభ్యులు పులికంటి మహేష్,నాయకులు బందెల జగన్, కలకొండమల్లేష్, హనుమండ్ల మహేష్, సాటు మహేష్,వడ్డమోని శ్రీకాంత్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సురమల్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇరుకు రోడ్డుతో వాహనదారుల ఇక్కట్లు!

### రామన్నపేట--అమ్మనబోలు రహదారిపై తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండల కేంద్రం నుంచి అమ్మనబోలు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రహదారిపై ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు తప్పుకోవడానికి కూడా సరైన స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఎదురైనప్పుడు ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాలువలు కూడా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవడంతో పాటు డ్రైనేజీ కాలువలకు మూతలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కరీంనగర్‌లో భక్తిశ్రద్ధలతో ఘనంగా పల్లకి సేవ , గంగా హారతి కార్యక్రమాలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్‌లోని కాపువాడలో శ్రీ దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో, తోట అనిల్ నేతృత్వంలో పల్లకి సేవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. అనంతరం 44వ డివిజన్‌లో అభయ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గంగా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా భవాని యూత్ సభ్యులు, అభయ్ యూత్ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



## ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన

# వాతావరణంలో విద్యా బోధన సాగాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను బుధవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి, కళాశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాలకు సంబంధించి, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సంఖ్య అడిగి తెలుసుకున్నారు.

ప్రణాళిక ప్రకారం విద్యా సంవత్సర సిలబస్ పూర్తి చేయాలన్నారు. నర్సింగ్ వృత్తి అంటే ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించాలన్నారు. చదువు పూర్తి కాగానే వారు నర్సింగ్ వృత్తిలో స్థిరపడేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రాక్టికల్ విద్యాబోధన మెరుగ్గా అందించేలా దృష్టి సారించాలని సూచించారు.

కళాశాలలో పలు మౌలిక వసతుల అవసరాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తేగా.. స్పందించిన కలెక్టర్ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

ఈ తనిఖీలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ మంజుల, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ





**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన రెండు రీసర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్‌కు సూచించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం గ్రామస్థులు, రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూమార్చండి రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భూ సరిహద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

భూ రీసర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా గ్రామస్థులు, రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## విబిజి రామ్‌జీ పథకం కింద అర్హులందరికీ ఉపాధి కల్పించాలి

### నీటి సంరక్షణ పనులు విరివిగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాల్లో విబిజి రామ్ జీ పథకం అమలు, అర్హులకు ఉపాధి కల్పన, నీటి సంరక్షణ పనులు చేపట్టే అంశాలపై జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో విబిజి రామ్ జీ జాబ్ కార్డులు కలిగిఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకుగానూ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం చేత వ్యవసాయం, తదితర అంశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరికీ విబిజి రామ్ జీ కింద 125 రోజుల పని కల్పించాలన్నారు.

ఉపాధి కల్పన ద్వారా పేదలకు ఆర్థికంగా తోడ్పాటు అందించినట్లవుతుందన్నారు. ఈ పథకం కింద 375 రకాల పనులు చేసుకోవచ్చని, జిల్లాలో అవకాశం ఉన్న పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పనికి వెళ్లేలా ప్రజల్ని ప్రోత్సహించాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీనిద్వారా పేదలకు ఉపాధి కల్పించడమే కాకుండా, భూగర్భ జలాల సంరక్షణకు తోడ్పడినవారమవుతామని తెలిపారు.

## నగర పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల

# కల్పనే ధ్యేయం



### మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగర విస్తరణకు అనుగుణంగా పారిశుధ్యం మెరుగుపరిచి, అభివృద్ధి పనులతో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా బుధవారం కార్పోరేషన్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, పాలకవర్గ సభ్యులతో కలిసి నగరపాలక సంస్థకు చెందిన రూ.1 కోటి నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన జేసీబీ, లాడర్ యంత్రాలను లాంచనంగా ప్రారంభించారు.మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్వయంగా యంత్రాలను నడిపి వాటి పనితీరును పరిశీలించారు. ఈ సంధర్బంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ఒకవైపు పారిశుధ్య నిర్వహణ, మరో వైపు అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా తమ పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. పెరుగుతున్న నగర విస్తరణకు అనుగుణంగా పారిశుధ్య పనులను, వీధి దీపాల నిర్వహణ, ఇతర పరిపాలన కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు నగరపాలక సంస్థ నూతన యంత్రాలను అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. నగర ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి కావల్సిన వసతులు కల్పించేందుకు యంత్రాల వినియోగం చాలా ముఖ్యం అన్నారు. నగరపాలక సంస్థలో చాలా గ్రామాలు విలీనం చెంది జనభాతో పాటు నగర విస్తీర్ణం కూడ పెరిగిందని, స్థానిక ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్పోరేషన్ లో అవసరమైన యంత్రాలను వినియోగించడంలో భాగంగా నూతనంగా జేసిబి, లాడర్ యంత్రాలను కొనుగోలు చేశామన్నారు. త్వరలోనే మరో రెండు వైకుంఠ రథాలను కూడ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో రెండు ఫాగింగ్ యంత్రాలు, 66 ట్రైసైకిల్లు (రిక్షాలు) కూడ కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు తెలిపారు.నగరంలోని 66 డివిజన్ల ప్రజల సౌకర్యార్థం యంత్రాలను కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు తెలిపారు. పాలకవర్గ సభ్యుల సహకారంతో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనలో నగరపాలక సంస్థ ముందు వరసలో ఉందని ప్రజలు మా దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను వేగవంతంగా పరిష్కరించి ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారంకు తమ పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు.తాము అధికారంలోకి వస్తే డంపింగ్ సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన మాట ప్రకారం తమ పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ కింద్ 17 కోట్లతో బయోమైనింగ్ ప్రక్రియను త్వరలోనే ప్రారంభం చేయడం జరుగుతుందని తెలిపారు. గత 50 సంవత్సరాలుగా గుట్టలుగా పేరుకు పోయిన చెత్తను ప్రక్షాళన చేసే విధంగా అధికారులు, పాలకవర్గ సభ్యులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే డంపింగ్ యార్డును స్వయంగా సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించామని, పొగ మంటలు రాకుండ తగిన సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రతి రోజు 150 మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్ యార్డు కు చేరుతుందని దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్ యార్డులో ఉండగా దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేశామన్నారు.త్వరలోనే పూర్తిగా స్థాయిలో డంపు యార్డును ప్రక్షాళన చేస్తామని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో కరీంనగర్ ను అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కింలో చేర్చి 840 కోట్లకు ప్రతిపాదనలు చేసి టెండర్ ప్రక్రియ కూడ పూర్తి చేశామన్నారు. యూసిఎఫ్ స్కీంలో కూడ ప్రధానంగా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కొసం 80 కోట్ల నిధులు కేటాయించి ప్రాసెసింగ్ యూనిట్ పద్దతిలో డంపు యార్డు ప్రక్షాళన చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే రెండు నిధులకు సంబంధించిన పనులు ప్రారంభం చేసి రెండు పద్దతుల్లో చెత్తను ప్రక్షాళన చేసి స్థానిక ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియల ద్వారా సంవత్సర కాలంలో చాలా వరకు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. చాలా ఏళ్ళ నుండి పేరుకుపోయిన చెత్త కాబట్టి ప్రక్షాళన ప్రక్రియను నగరపాలక సంస్థ నిరంతరంగా కొనసాగిస్తుందని, ప్రజలు కొంత సంయమానం పాటించాలని కోరారు. నగర ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, కరీంనగర్‌ను మోడల్ సీటీగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను

# వెంటనే పదవి నుండి తొలగించాలి

### పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్ లో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్ పాల్గొని మాట్లాడుతూ, భారతదేశంలో ప్రజాపోరాటాల ద్వారా సాధించుకున్న ఓటు హక్కును సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కాలరాస్తున్నారని, ఆయనను వెంటనే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్.ఎస్.ఎస్, బిజెపి ఒత్తిళ్లకులొంగిరాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును తొలగించడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని విమర్శించారు. దేశంలో సుమారు 13 కోట్ల మంది అర్హులైన యువత ఓట్లను తొలగిస్తూ, బీజేపీకి అనుకూలంగా ఏకపక్షనిర్ణయాలుతీసుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే 'సర్' ప్రక్రియను నిలిపివేసి, తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చాలని కోరారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేస్తూ, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై తీవ్రమైన నిర్బంధకాండను ప్రయోగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్నారనిమండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, యువజన వ్యతిరేక విధానాలపైయువతనుచైతన్యపరిచి, పి.వై.ఎల్ ఆధ్వర్యంలో బలమైనపోరాటాలునిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రతాప్, సహాయ కార్యదర్శులు బి.ఎస్. కృష్ణ, కొర్సం రామకృష్ణ, కమిటీ సభ్యులు భీమేష్, సిద్దు, ప్రేమ్ సింగ్, మంగయ్య, కరుణాకర్ మరియు ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి సంగం అరుణ్ కుమార్ తదితరులుపాల్గొన్నారు.

## మన్ననూర్‌లో 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో సుమారుగా 53.78 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, విద్యుత్ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ నరసింహ, గ్రామ సర్పంచ్ మంజుల, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## చండీదేవి అవతారంలో దుర్గాదేవి



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చండీదేవి అవతారంలో దుర్గాదేవి పూజలు అందుకున్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణము, అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెన్ రెడ్డి సంధ్య, డాక్టర్ ఉజ్జీనీ మంజుల, ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, వర్కల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్ , గుగులోతు అరుణ, మహిళా భక్తులు పెద్ది స్వాతి కిషోర్ శర్మ, చింతల కరుణ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సభ్యులు పోలోజు శ్రీలత,ముటుకులోజు నీరజ,వనం మమత, సురోజు శోభారాణి, జూకంటి రేవతి, నిమ్మల అండాలు, మామిడి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ ట్రాఫిక్ ఏసిపి

### టి సత్యనారాయణ



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను వరంగల్ ట్రాఫిక్ ఏసిపి టి. సత్యనారాయణ సందర్శించి వార్షిక ఇన్స్పెక్షన్ చేసినారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారి యొక్క కిట్టాటికల్స్ ఇన్స్పెక్షన్ చేసినారు. తదుపరి కాజీపేట ట్రాఫిక్ పిఎస్ రికార్డుల పరిశీలించినారు. సిబ్బందితో సమావేశమై వారి యొక్క ఇతి బాధలు తెలుసుకొని వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా తెలుసుకొని సిబ్బందితో ట్రాఫిక్ విధులు గురించి నియమాల గురించి ట్రాఫిక్ రెగ్యులరైజేషన్ గురించి సవివరంగా వివరించారు. సిబ్బంది తగు జాగ్రత్తలతో అన్నివేళలా ఆలెర్టుగా ఉండి ఎటువంటి విషయంలోనూ కాంప్రమైజ్ కాకుండా నియమ నిబంధనలతో విధిని నిర్వహించాలని సూచించారు.

## ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి.. జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి

### ఓటు హక్కును కాపాడాలి.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్

### తెలంగాణలో విద్యార్థి సంఘాల ఉద్యమం ఆగదు



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్ చౌహాన్ మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడటంతో పాటు ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసే వరకు తెలంగాణలో విద్యార్థి సంఘాల ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టామని నాయకులు తెలిపారు. ప్రజల ఓటు హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా నిరసన తెలిపిన ఏఐఎస్ఎఫ్--ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్ చౌహాన్, జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, నాయకులు ఆకాష్ నాయక్, శివకుమార్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.10,116 విరాళం

### నర్సప్పగూడలో ఉత్సవాల నిర్వహణకు ఆర్థిక సహకారం



**షాద్ నగర్ , అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లానందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్ రెడ్డి రూ. 10,116 ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద ఉత్సవాల నిర్వాహకులకు ఈ విరాళాన్ని అందించారు. భక్తి కార్యక్రమాలకు సహకారం అభినందనీయం దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఎమ్మెల్సీ ఆర్థిక సహకారం అందించడం పట్ల గ్రామస్తులు, ఉత్సవాల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సప్పగూడ ఉపసర్పంచ్ అప్పల సిద్ధయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ చారి, జంగిలి కుమార్, మాజీ ఉపసర్పంచ్ కాట్న శేఖర్, మహేందర్, సురేష్, జంగిలి యాదయ్య, గోవిందు, శేఖర్, కాట్న శ్రీనివాస్, నక్కల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష..

### పెండింగ్ కేసుల పరిష్కారంపై ఎస్పీ కీలక ఆదేశాలు

### డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నేర సమీక్ష చేపట్టారు. పెండింగ్ కేసుల పరిష్కారం, ఈ–పెట్టీ కేసుల డిస్పోజల్, దసరా బందోబస్తు, దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి కీలక సూచనలు చేశారు.

**పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం**

60, 90 రోజుల గడువుతో దర్యాప్తులో ఉన్న కేసులను నిర్దేశిత సమయంలోగా నాణ్యమైన దర్యాప్తుతో పూర్తి చేయాలని, కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు.

**ఈ-పెట్టీ కేసుల డిస్పోజల్**

ఈ–పెట్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



**దుర్గామాత, దసరా బందోబస్తు ఏర్పాట్లు**

దసరా పండుగతో పాటు దుర్గామాత ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నిమజ్జన మార్గాలు, చెరువులు, వాగుల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఎస్బిఐ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీసీరబీ , ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో పొరుగు జిల్లా నేత 'హవా'..

## రూ. 8 కోట్ల పనుల కేటాయింపుపై స్థానిక లీడర్ల తీవ్ర అసంతృప్తి!

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో స్థానికేతర నాయకుని జోక్యం రోజురోజుకు తలనొప్పిగా మారుతోంది. పొరుగు జిల్లాకు చెందిన ఓ కీలక నేత వ్యవహారశైలిపై సొంత పార్టీ సీనియర్లు, స్థానిక నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పీఠం చేజారినా ఆ నేత తీరుమారలేదని, తాజాగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను తన అనుయాయుడికి కట్టబెట్టడంలో తెర వెనుక చక్రం తిప్పారనే ఆరోపణలు పార్టీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగిన ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్మన్‌గా తన అనుయాయుడిని గెలిపించుకుని నియోజకవర్గ రాజకీయాలపై పట్టు బిగించాలని ఆ పొరుగు జిల్లా నేత భావించారు. అయితే, పక్క జిల్లా నాయకుని పెత్తనాన్ని జీర్ణించుకోలేని స్థానిక లీడర్లు ఛైర్మన్ ఎన్నికను లైట్ తీసుకున్నారు. ఫలితంగా మెజారిటీ కౌన్సిలర్లు గెలిచినప్పటికీ, కాంగ్రెస్‌కు దక్కాల్సిన మున్సిపల్ ఛైర్మన్ పీఠం కాస్తా బీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లింది. మెజారిటీ కౌన్సిలర్లు తమ కష్టంతో గెలిచినప్పటికీ, ఛైర్మన్ పదవి ఎంపిక స్థానికేతర నాయకుని కనుసన్నల్లో జరగడం ఇక్కడి సీనియర్లకు అసలు రుచించలేదు. పొరుగు జిల్లా నేత అతిఉత్సాహం వల్లే మున్సిపల్ పీఠం చెజారిందనే స్పష్టమైన రిపోర్ట్ అధిష్టానం వద్ద ఉన్నప్పటికీ, హైకమాండ్ పట్టించుకోకపోవడం స్థానిక నేతలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

**రూ. 8 కోట్ల పనుల కేటాయింపులో చక్రం తిప్పి..**

అయినా సదరు నేత తీరులో మార్పు రాలేదని పార్టీ వర్గాలు మండిపడుతున్నాయి. ఇటీవల మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల టెండర్లలో ఆ పొరుగు జిల్లా నేత మళ్లీ తన మార్క్ చూపించారనే ఆరోపణలున్నాయి. గతంలో ఛైర్మన్ పదవి కోల్పోయిన తన అదే అనుయాయుడికి సుమారు రూ. 8 కోట్ల విలువైన అభివృద్ధి పనులను కట్టబెట్టడంలో ఈ నేత సఫలమయ్యారు. ఈ పనులను దక్కించుకోవడం కోసం తక్కువ రేట్లకు కోట్ చేసిన మరో ఇద్దరు కాంట్రాక్టర్ల టెండర్లను టెక్నికల్ కారణాలతో రిజెక్ట్ చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంచార్జ్ మంత్రిపై ఒత్తిడి తెచ్చి మరీ ఈ తతంగాన్ని నడిపించినట్లు సొంత పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఈ ఏకపక్ష నిర్ణయం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అంటీముట్టనట్లుగా స్థానిక లీడర్లు.. భవిష్యత్తుపై ఆందోళన**

పొరుగు జిల్లా నేత మితిమీరిన జోక్యం, ఆధిపత్య ధోరణి కారణంగా స్థానిక నేతలు పార్టీ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కార్యక్రమాలకు 'అంటీ అంటనట్లు'గా వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, స్థానిక కేడర్‌కు తీవ్ర నష్టం తప్పదనే వాదనలు సొంత పార్టీలోనే బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధిష్టానం కలుగజేసుకొని స్థానికేతర పెత్తనానికి అడ్డుకట్ట వేయాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ

# నిబద్ధతతో విధులు నిర్వహించాలి

**పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి**

**జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలి**

**జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఆయా కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు పురోగతి, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రతి కేసులో నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రతి పోలీస్ అధికారి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నిబద్ధతతో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని,అదే సమయంలో సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రతి అధికారి తన పరిధిలోని సిబ్బంది పనితీరు, ప్రవర్తన, విధుల నిర్వహణతో పాటు వారి కదలికలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని,అవసమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలన్నారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్ దాఖలు, కోర్టు విచారణకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు.జిల్లాలో దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి నిరంతర



నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై అప్రమత్తంగా ఉంటూ నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, జూదం ,అక్రమ ఇసుక రవాణా, అక్రమ పిడియాస్ రైస్ రవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, నేరాలను ముందస్తుగా అరికట్టడం లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజు వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జన శోభాయాత్ర ముగిసే వరకు ఉత్సవ నిర్వాహకులు, కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు , సి.ఐ లు, ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరంలో వైభవంగా శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీ హోమం, అన్న ప్రసాద వితరణ చేసిన యాదగిరి సునీల్ రావు-అపర్ణ దంపతులు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన పలు దుర్గామాత మండపాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు- అపర్ణ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోదాంగడ్డ ప్రాంతంలోని క్రాంతి యూత్ క్లబ్, కాశ్మీర్ గడ్డ ఫండస్ స్కూల్ వద్ద గణేష్ యూత్ మరియు భగత్ నగర్ లో పెద్దమ్మ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను దర్శించుకున్నారు. అనంతరం భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ హోమం మరియు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మండప నిర్వాహకులు, కాలనీవాసులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**చెన్నపురావు పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో మంత్రి జూపల్లి**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావు పల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. సొంతింటి ద్వారా పేద కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ పథకం దోహదపడుతోందని తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. మహిళలు, రైతులు, పేద కుటుంబాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సోమిడి బతుకమ్మ ఆట స్థలాన్ని

# మెత్తటి డస్టుతో చదును చేయాలి

**జీడబ్ల్యూఎంసి అధికారులు చొరవ తీసుకోవాలని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లీకొండ యాదగిరి డిమాండ్**

**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొల్లీకొండ యాదగిరి అన్నారు.బుధవారం రోజున వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 62వ డివిజన్ సోమిడీ శివారులోని ఎల్లమ్మ గుడి దగ్గర బతుకమ్మ ఆట స్థలాన్ని గ్రామ పెద్దలతో కలసి పరిశీలించడం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.పూలను పూజిస్తూ ప్రకృతిని



ఆరాధించే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు.

**బతుకమ్మ ఆట స్థలాన్ని మెత్తటి డస్టుతో ఏర్పాటు చేయాలి**

యాదగిరి మాట్లాడుతూ గత సంవత్సరం బతుకమ్మ ఆడుకునే ఆట స్థలంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ విభాగం వారు12 ఎంఎం చిప్స్ తో బతుకమ్మ ఆట స్థలన్ని మహిళలు ఆడుకోలేని విదంగా తయారు చేశారని, మహిళలు ఆడుకునే విధంగా తీర్చిదిద్దడంలో విపలమైనారని ఆరోపించారు.

**అధికారుల పర్యవేక్షణ ఉండాలి**

బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవము అని ఈసారైనా కొద్ది రోజులలో జరుపుకునే బతుకమ్మ ఆట స్థలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆట స్థలాన్ని చిప్స్ తో కాకుండా మెత్తటి డస్టుతో అటస్థలాన్ని తయారు చేయాలని సోమిడి ప్రజల తరపున డిమాండ్ చేశారు .ఏదో తుతూ మంత్రాంగ ఒకటి రెండు ట్రాక్టర్లు కాకుండ టెండర్ పద్దతిలో 100 క్యూబిక్ మీటర్ల క్వాంటిటీని పైగా వాడకం చేపించి సద్దుల బతుకమ్మకు ఒక్కరోజు ముందు కాకుండా వారం రోజుల ముందస్తుగా అటస్థలాన్ని తయారుచేసి మహిళలకు బతుకమ్మ ఆటకు అందుబాటులో ఉండే విధంగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ఆట స్థలలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ ఉండేలా చూడాలని యాదగిరి స్పష్టం చేశారు.

## ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కోటి వ్యయంతో జేసీబీ, ల్యాడర్ కొనుగోలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు మరియు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సుమారు కోటి రూపాయల వ్యయంతో కొత్తగా జేసీబీ మరియు ల్యాడర్‌ను కొనుగోలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ తో కలిసి నూతన వాహనాలకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో కొత్తగా విలీనమైన గ్రామాల్లో విస్తీర్ణం పెరగడం మరియు డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉండటంతో, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కోటి రూపాయలతో జేసీబీ మరియు ల్యాడర్‌ను కొనుగోలు చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మూల మంత్ర హోమం



**నడిగూడెం, అక్షిత న్యూస్:** స్థానిక శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో రెండు రోజులుగా శిఖర ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మూలమంత్ర హోమం ఘనంగా భక్తశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ హోమంలో పాల్గొని భగవంతుడు కృపకు పాత్రులు అయ్యారు. ఆలయ అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం నిర్వహించిన హోమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. యంత్ర స్థాపన, శిఖర స్థాపన, మహా పూర్ణాహుతి, మంగళ నీరాజనం కార్యక్రమాలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. రెండు రోజులుగా శిఖర ప్రతిష్ట కార్యక్రమాలను భక్తులు కనులవిందుగా తిలకించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రేపాల పురుషోత్తం, మొరిశెట్టి రమణారావు, మహేష్, శ్రీనివాసరావు, దయాకర్, సూరిబాబు, మోహన్ రావు, చంద్రమోహన్, పసుపులేటి బిక్షం, మండవ వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, బాలాజీ నాయక్, బెల్లంకొండ సత్యనారాయణ, భవిరిశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాతలను, అర్చక బృందాన్ని ఘనంగా సన్మానించారు.

## పాపిరెడ్డిగూడ దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు.. పాల్గొన్న తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి




**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా పాపిరెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత కుంకుమార్చన పూజా కార్యక్రమంలో కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, ఐకమత్యం, అభివృద్ధి వెల్లివిరియాలని దుర్గామాతను ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో స్థానిక భక్తులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు..

# ఎలినీనో ప్రభావంతో ఎండిపోతున్న పంటలు..

### నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

### నారాయణపేట ఏరియా కార్యదర్శి బండమీది బలరాం డిమాండ్



**నారాయణపేట,అక్షిత బ్యూరో:** ఎలినీనో ప్రభావం వల్ల జిల్లాలో 11 శాతం లోటు వర్షపాతం నమోదైందని, దీనివల్ల రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు కోల్పోయి తీవ్ర ఆందోళనలో ఉన్నారని సిపిఎం నారాయణపేట ఏరియా కార్యదర్శి బండమీది బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నారాయణపేట మండల పరిధిలోని బొమ్మన్‌పాడు గ్రామ శివారులో ఎండిపోయిన టమోటా, వంకాయ తోటలతో పాటు ఇతర పంట పొలాలను సిపిఎం బృందంతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎండిపోయిన పంటలను చూపిస్తూ రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల వల్ల అన్నదాతలు ఎంతో ఆశతో, అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి అంతా మట్టిపాలైందని అన్నారు.

11 శాతం వర్షపాత లోటు కారణంగా సాగునీరు అందక, చేతికొచ్చే దశలో పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని పేర్కొన్నారు. ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిపోయిన ఆహార ధాన్యాల పంటలకు ఎకరాకు రూ. 25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలనన్నారు. తీవ్రంగా నష్టపోయిన వాణిజ్య మరియు కూరగాయల పంటలకు (టమోటా, వంకాయ తదితర తోటలకు) ఎకరాకు రూ. 50,000 చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు . వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పంట పొలాలను సర్వే చేసి నివేదికలు రూపొందించాలన్నారు

అప్పుల ఊబిలో ఉన్న రైతులు అధైర్యపడి ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి రైతుల్లో భరోసా కల్పించాలి.రైతు భరోసా వెంటనే అందివ్వాలన్నారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో సిపిఎం బొమ్మన్‌పాడు గ్రామ నాయకులు అంతన్ గారి బాల్‌రామ్ ,కంకప్ప, వెంకటేష్, రాములు,నరసింహ,ఒగ్గ బాలప్ప తదితరులలతో పాటు బాధిత రైతులు జనార్ధన్, బర్ల నాగప్ప, బస్వరాజ్, దానగాళ్ల నాగప్పలు పాల్గొన్నారు.

## భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా కల్లూరి పవన్ గంగపుత్ర నియామకం



**కాశిబుగ్గ , అక్షత న్యూస్ :** గంగపుత్ర సామాజిక వర్గ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు కల్లూరి పవన్ గంగపుత్ర వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీసీ నాయకుడు కల్లూరి పవన్ గంగపుత్రకు భద్రకాళి దేవస్థానం పాలక మండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించేందుకు సహకరించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డికి తెలంగాణ గంగపుత్ర సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సేవ పట్ల అంకితభావంతో పనిచేసే కల్లూరి పవన్ గంగపుత్రకు ఈ బాధ్యత దక్కడం గంగపుత్ర సామాజిక వర్గానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి దేవస్థానం అభివృద్ధికి పవన్ గంగపుత్ర తన వంతు కృషి చేయాలని భక్తులకు సకాలంలో అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఆలయ అభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు సంపాదించాలని కల్లూరి పవన్ గంగపుత్రకు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలిపారు

## కాజిపేట్ సోమిడి యాదవ పరపతి సంఘం ఆధ్వర్యంలో సభ్యులకు దసరా బోనస్ పంపిణీ

### పాల్గొన్న జీడబ్ల్యూఎంసి 62వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్





**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం సోమిడీ యాదవ పరపతి సంఘం ఆధ్వర్యంలో సంఘం సభ్యులకు దసరా పండుగ, 24 సంవత్సరాలు పూర్తి చేసుకుని 25వ సంవత్సరంలో అడుగు పెడుతున్న శుభ సందర్భంగా రూ.5,000 చొప్పున 233 సభ్యులకు దసరా బోనస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

జక్కుల రవీందర్ యాదవ్ 62వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ హజరై తన చేతుల మీదుగా బోనస్ అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో సభ్యులకు దసరా బోనస్ అందజేయడం పట్ల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ప్రజలందరికీ దేవీ నవరాత్రుల శుభాకాంక్షలు, ముందస్తు విజయదశమి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ మెరుగు రాజయ్య యాదవ్, రాజారపు బుచ్చయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి మంత్రి కుమార్ యాదవ్, క్యాషియర్లు మేకల కుమార్ యాదవ్, జక్కు రమేష్ యాదవ్ పాల్గొన్నారు.